నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, బుధవారం 7 ఫిబ్రవరి 2024 | SIDDIPET

మైనంపల్లి షో..
అట్టర్ ఫ్లాప్

సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీతో ఏర్పడిన ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్ వాహనం

అరువు తెచ్చుకున్న క్యాడర్‌తో సిద్దిపేటలో కాంగ్రెస్ షో..

అంబులెన్స్‌లకు తప్పని తిప్పలు..
ర్యాలీకి మొహం చాటేసిన మంత్రులు పొన్నం, కొండా సురేఖ
మైనంపల్లి ర్యాలీకి రోప్ పార్టీ ఏర్పాటు చేసిన పోలీసులు
పోలీసుల అత్యుత్సాహం..ట్రాఫిక్‌కు ఇబ్బందులు
కాంగ్రెస్‌లో బయట పడిన గ్రూపులు
ఓ వర్గం ఫ్లెక్సీలు.. మరో వర్గం చించివేత
పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మైనంపల్లి హన్మంతరావు షో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. మంత్రి కాదు... ఓ ఎమ్మెల్యే కాదు. ఆయన ఒక మాజీ ఎమ్మెల్యే మాత్రమే.. ఆయనకు రోప్ పార్టీతో సిద్దిపేట పోలీసులు స్వాగతం పలికారు. సీఎం స్థాయి వాళ్లకు మాత్రమే రోప్ పార్టీ ఏర్పాటు చేస్తారు. కాంగ్రెస్ పార్టీ ర్యాలీలో పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి ర్యాలీ వెంట నడవడం గమనార్హం. మధ్యాహ్నం రెండు గంటల నుంచి చౌరస్తాలు, ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయినా...రోడ్లపై భారీ క్రేన్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వచ్చి పోయే వాహనాలకు ఇబ్బందులు కలిగినా పట్టించుకోలేదు గానీ... మామూలు ప్రజలపై తమ జులుం చూపించారు. చలో సిద్దిపేట పేరిట కాంగ్రెస్ మంగళవారం నిర్వహించిన ర్యాలీలో ఆ పార్టీ నాయకుల గ్రూపులు మరో సారి బయటపడ్డాయి. సిద్దిపేటలో అది చేస్తాం..ఇది చేస్తాం వందలాది వాహనాలతో ర్యాలీ నిర్వహించి తమ సత్తా చాటుతామని చెప్పిన కాంగ్రెస్ ఆదిలోనే తుస్సు మంది.సిద్దిపేట పట్టణంలో బీజేఆర్ చౌరస్తా నుంచి ర్యాలీ ప్రారంభమై న్యూ, పాత బస్టాండ్ మీదుగా ముస్తాబాద్ చౌరస్తా నుంచి కోమటి చెరువు (కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయ భూమి పూజ స్థలికి) చేరుకుంది. సిద్దిపేట నియోజకవర్గంలో క్యాడర్ లేక ఇతర ప్రాంతాల నుంచి అరువు తెచ్చుకొని సిద్దిపేటలో షో చేశారు తప్పా..మరేమి లేదని సొంత పార్టీ నేతలే విమర్శలు చేస్తున్నారు. ఈ సమావేశానికి రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తదితరులు హాజరవుతారని విస్తృత ప్రచారం చేశారు. మంత్రులు మొహం చాటేశారు. ముందు రోజు సిద్దిపేటలో మంత్రి పొన్నం ప్రభాకర్ షెడ్యూల్ సైతం విడుదలైంది. దీంతో కాంగ్రెస్‌లో ఉన్న గ్రూపులు బట్టబయలయ్యాయి. చివరకు మైనంపల్లి హన్మంతరావు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ వీరిద్దరు తండ్రి కొడుకులు తమ వెంట బయట నుంచి తెచ్చుకున్న క్యాడర్‌ను సిద్దిపేటలో షో చేశారు. స్థానికంగా ఉన్న క్యాడర్‌లో ఎవరి గ్రూపులు వారికే ఉన్నాయి. ఈ ర్యాలీకి ఎక్కడి గ్రూపు వారు అక్కడే ఉండి ఒకరికొకరు కలువకుండా మైనంపల్లి స్వాగతం పలికారు. ర్యాలీ ప్రారంభం కాక ముందే గంటల తరబడి బీజేఆర్ చౌరస్తా వద్ద వన్ వే చేయడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.పెద్ద పెద్ద క్రేన్లు, ఫ్లెక్సీలు కట్టి నడి రోడ్డుపై ఉంచారు. ఇదంతా పోలీసుల కనుసన్నల్లోనే జరిగింది. ట్రాఫిక్ ఆంక్షలతో అంబులెన్స్‌లు వెళ్లడానికి కూడా ఇబ్బంది కలిగింది. సోమవారం అర్ధరాత్రి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన చక్రధర్‌గౌడ్‌కు సంబంధించిన ఫ్లెక్సీలను ఇతర వర్గం వారు చింపివేశారు. దీంతో ఆగ్రహించిన ఆయన వర్గీయులు ఫ్లెక్సీలు చింపిన వారిపై సిద్దిపేట వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సిద్దిపేటలో కాంగ్రెస్ క్యాంపు కార్యాలయానికి భూమి పూజ ఉందని కొందరు, చలో సిద్దిపేట అని మరికొందరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. మొత్తంగా ఎవరి వారే అన్నట్లుగా వ్యవహరించారు.

సిద్దిపేటలో రోప్ పార్టీ పోలీసులు

సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద రోడ్డుకు అడ్డంగా భారీ క్రేన్‌తో పెట్టిన ఫ్లెక్సీలు

అభివృద్ధిలో అగ్రగామి సిద్దిపేట

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 6: అభివృద్ధిలో సిద్దిపేట జిల్లా అగ్రగామిగా నిలిచిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధిని చూసి కేంద్రం అనేక అవార్డులు ఇచ్చిందని, అందులో కేసీఆర్, హరీశ్‌రావు కృషి మరువలేనిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలోని ఇతర జిల్లాలను అభివృద్ధి చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాలను బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుచుకుంటారని, రాష్ట్ర ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హుందాగా మాట్లాడాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. రైతుబంధు కోసం కర్షకులు ఎదురుచూస్తున్నారని, హామీలు అమలు చేయకుండా గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం ఎక్కడ కూడా జాప్యం చేయలేదన్నారు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం చేసి రైతాంగానికి సాగునీరందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అభివృద్ధిలో సిద్దిపేట జిల్లా రాష్ట్రానికే మోడల్‌గా నిలిచిందన్నారు. జిల్లాలో నూతన కలెక్టరేట్, అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం, అటవీ కళాశాల, మెడికల్ కళాశాల, జిల్లా దవాఖాన, విశాలమైన రోడ్లు, కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు ఎక్బాల్, శ్రీనివాస్, భిక్షపతి, నరేశ్, కుమార్, కనకరాజు, పోచయ్య, అఖిల్, స్వామి, ప్రకాశ్ పాల్గొన్నారు.

గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వేతన వెతలు

కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు తప్పా ఆచరణలో శూన్యం
ఉమ్మడి మెదక్ జిల్లాలో 70 శాతానికి పైగా ఇంకా వేతనాలు పడలేదు
ప్రభుత్వ తీరును ఎండగడుతున్న ఉద్యోగులు
అందరికీ ఒకేసారి జీతాలు వేయాలని డిమాండ్

జీతాల కోసం ఉద్యోగుల ఎదురు చూపులు

సిద్దిపేట, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికారం కోసం కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చింది. ప్రతి నెలా ఒకటో తారీకునే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లిస్తామని గొప్పలు చెప్పినా ఆచరణలో మాత్రం శూన్యం. ఒకటో తారీకు పోయి ఏడో తేదీ వచ్చినా ఇంకా 70 శాతానికి పైగా ఉద్యోగులకు జీతాలు పడలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ఉద్యోగులు తమ జీతాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి, తన సహచర మంత్రులు చెబుతున్న మాటలకు చేసే పనులకు పొంతన లేకుండా పోయిందని పలువురు ఉద్యోగులు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటో తారీకునే జీతాలు చెల్లిస్తుందని చెప్పడంలో ఏమాత్రం వాస్తవం లేదని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు అంటున్నారు. వాస్తవంగా జరుగుతున్న విషయం ఏమిటంటే బిల్లులు తక్కువగా ఉన్న ఎస్టీవోల నుంచి ఒకటో తారీకున విడుదల చేస్తున్నారు. దీంతో అందరికీ జీతాలు ఒకటో తారీకునే వేశామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది.

విడతల వారీగా జీతాలు జమ ..

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తారీకు జీతాలు చెల్లిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. గతంలో కూడా విడతల వారీగా పలు జిల్లాల్లో జీతాలు జమ య్యేవి. ఇప్పటికీ విడతల వారీగా జిల్లాల్లో జీతాలు జమవుతున్నాయి. కానీ, ఒకటో తారీకునే రాష్ట్రం మొత్తం జీతాలు జమ చేసినట్లు విస్తృత ప్రచారం జరుగుతున్నది. ఒక జిల్లాలో సైతం ఎస్టీవోల వారీగా ఇప్పటికీ జీతాలు జమవుతున్నట్లు వంటి పరిస్థితి ఉంది. ఏదో ఒక జిల్లాలో జీతాలు ఒకటో తారీకున జమయితే ముఖ్యమంత్రికి ఆ ఒక్క జిల్లా ఉద్యోగి ఎక్స్ వేదికగా తన భార్య ఆశ్చర్యపోయిందని చెప్పడం మొత్తం రాష్ట్రానికి వర్తించేలా ప్రచారం జరిగింది. ఇప్పటికైనా రాష్ట్రం మొత్తం ఒకేసారి ఒకటో తారీకు జీతాలు వచ్చినప్పుడు మెరుగుపడినట్లు భావించాల్సి వస్తుంది. ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన మూడు డీఏల పై మంత్రులు తలో మాట మాట్లాడుతూ విడుదల చేసినట్లుగానే ప్రకటనలు చేస్తున్నారు.

– పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి,
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి

ఏడో తేదీ వచ్చినా జీతాలు రాలేదు.

సిద్దిపేట,మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏడో తారీకు వచ్చినా జీతాలు పడలేదు. కొద్ది మంది ఉద్యోగులకు జీతాలు వేసి అందరికీ వేశామని ప్రభుత్వం చెబుతుంది. సిద్దిపేట జిల్లా పరిధిలో హుస్నాబాద్, గజ్వేల్ పరిధిలోని ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. సిద్దిపేట, దుబ్బాక, తొగుట, చేర్యాల ఎస్టీవో పరిధిలోని ఉద్యోగులకు జీతాలు ఇంకా పడలేదు. సంగారెడ్డి జిల్లా పరిధిలో అందోల్, జహీరాబాద్, పటాన్‌చెరు, నారాయణఖేడ్, సంగారెడ్డి ఎస్టీవో పరిధిలోని ఉద్యోగుల్లో కొద్దిమందికి మాత్రమే జీతాలు పడ్డాయి. మెదక్, నర్సాపూర్ ఎస్టీవో పరిధిలో కూడా అంతే సంగతులు. వాస్తవాలు ఇలా ఉంటే ప్రభుత్వం ఒకటో తారీకునే ఉద్యోగులకు జీతాలు వేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధశాఖల్లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు తమ వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఒకటో తారీకున జీతాలు వేయలేదని గత ప్రభుత్వాన్ని ఆడిపోసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు సకాలంలో వేయడం లేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. చిన్న ఎస్టీవో పరిధిలో జీతాలు జమకాగానే తన ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారు తప్పా పూర్తి స్థాయిలో ఉద్యోగులకు వేతనాలు ఒకటో తారీకున రిలీజు చేయడం లేదు. ఫిబ్రవరి 7వ తేదీ వచ్చినా జీతాలు పడలేదు అంటే .. కాంగ్రెస్ ప్రభుత్వ మార్పు ఏంటో కనిపిస్తుంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒకటో తారీకునే ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా ఒకేసారి జీతాలు వేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల పరిస్థితి ఇలా ఉంటే కాంట్రాక్ట్ పద్ధతిన పని చేసే ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం.ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగుల పరిస్థితి కూడా అంతే. వీరు గ్రామాల్లో కీలక పాత్ర పోషిస్తారు.గ్రామాలు, పట్టణాల్లో మహిళా సంఘాలు ఏర్పాటు చేయడం, వారిని ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పాటు అందించడంతో పాటు గ్రూప్ లోన్స్, బ్యాంక్ రుణాలను మహిళా సంఘాలకు ఇప్పించడం, సకాలంలో రుణాల చెల్లింపుల్లో ఈ ఉద్యోగులది కీలక పాత్ర. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చడంతో పాటు ప్రతి సంక్షేమ పథకం అందేలా ఈ ఉద్యోగులు కృషి చేస్తారు. ఇంతలా కృషి చేస్తున్న తమకు సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. కాంగ్రెస్ చెప్పిన మాటలకు మోసపోయామని వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు వాపోతున్నారు.

ఖాకీల బదిలీలు

సంగారెడ్డి జిల్లాలో 8 మంది ఇన్‌స్పెక్టర్లు..
ఆరుగురు ఎస్సైలు ట్రాన్స్‌ఫర్

సంగారెడ్డి, ఫిబ్రవరి 6: హైదరాబాద్ మల్టీ జోన్-2 రాచకొండ కమిషనరేట్ పరిధిలో సంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మంగళవారం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. ట్రాన్స్‌ఫర్ అయిన వారిలో వికారాబాద్ డీటీసీ (డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్)లో విధులు నిర్వహిస్తున్న పరమేశ్వర్‌గౌడ్‌ను వీఆర్ (వేకెన్సీ రిజర్వుడ్) సంగారెడ్డికి బదిలీ చేశారు. సంగారెడ్డి ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్‌ను జిన్నారానికి, హైదరాబాద్ మల్టీ జోన్-2లో ఉన్న అనిల్‌కుమార్‌ను జోగిపేట్‌కు, జోగిపేటలో నుంచి నాగరాజును హైదరాబాద్ మల్టీజోన్-2కు, రాచకొండ పరిధిలోని శ్రావణ్‌కుమార్‌ను కంగ్టికి, కంగ్టి నుంచి జక్కుల హనుమంతును హైదరాబాద్ మల్టీజోన్-2కు, తాండూరులో విధులు నిర్వహిస్తున్న ఎం.రాంబాబు డీటీసీ సంగారెడ్డికి బదిలీ అయినట్లు ఎస్పీ రూపేశ్ వెల్లడించారు. బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లు తమ స్థానాల్లో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆరుగురు ఎస్సైలు బదిలీ...

జిల్లాలో ఆరుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ రాచకొండ మల్టీజోన్-2 సైబరాబాద్ కమిషనరేట్ ఐజీపీ ఆదేశాలు జారీ చేశారని ఎస్పీ రూపేశ్ తెలిపారు. సంగారెడ్డి రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ మెరావత్ రాజేశ్‌నాయక్‌ను పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్, గుమ్మడిదల నుంచి లక్ష్మారెడ్డిని జహీరాబాద్ టౌన్, జహీరాబాద్ టౌన్ ఎస్సై కె.శ్రీకాంత్‌ను సీసీఎస్ సంగారెడ్డి, కొండాపూర్ నుంచి వినయ్‌కుమార్‌ను సంగారెడ్డి రూరల్, ఇంద్రకరణ్‌లో విధులు నిర్వహిస్తున్న మహేశ్వర్‌రెడ్డిని గుమ్మడిదల, సంగారెడ్డి మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోలా సోమేశ్వరిని అమీన్‌పూర్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. బదిలీ అయిన సబ్ ఇన్‌స్పెక్టర్లు వారికి కేటాయించిన స్టేషన్లలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిర్మాణ రంగం
ఇసుక కొరతతో ఆగిపోతున్న నిర్మాణాలు
కుదేలు..

బహిరంగ మార్కెట్‌లో అమాంతం పెరిగిన ధరలు
టన్నుకు రూ.1600 నుంచి రూ.1700 వరకు విక్రయం
బెంబేలెత్తుతున్న సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు
మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో లేని ఇసుక రీచ్‌లు, క్వారీలు
ఫిల్టర్ ఇసుకతో అక్రమార్కుల దోపిడీ
కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరితో భారీ కొరత

మెదక్/సంగారెడ్డి ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : ఇసుక కొరత మెదక్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం క్యూబిక్ మీటర్‌కు రూ.600 చొప్పున ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. అయితే, మెదక్ జిల్లాలో రీచ్‌లు, క్వారీలు లేకపోవడంతో నిర్మాణాలకు కావాల్సిన ఇసుక లభించక నిర్మాణదారులు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విపరీతమైన కొరతతో ధరలు అమాంతం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇదే అదనుగా బహిరంగ మార్కెట్‌లో ఇసుక వ్యాపారులు ధరలను ఆమాంతం పెంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక తవ్వకాలు, రవాణా విషయంలో అనుసరిస్తున్న వైఖరి కారణంగానే ధరలు అమాంతం పెరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇబ్బందులు పడుతున్న సామాన్యులు...

ఇసుక ధరలు ఒక్కసారిగా పెరగడంతో సొంతింటిని నిర్మించుకుంటున్న మధ్యతరగతి, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెదక్ జిల్లాలో పెద్దఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇసుక ధరలు మునుపెన్నడూ లేనంత స్థాయికి పెరగడంతో వారి ఆర్థిక అంచనాలు తలకిందులయ్యాయి. ఇసుక కొరత ఇలాగే కొనసాగితే నిర్మాణాలు ఆగిపోతాయేమోనని భయపడుతున్నారు. ప్లాస్టరింగ్‌కు వినియోగించే సన్న ఇసుకకు సైతం భారీగా డిమాండ్ ఏర్పడింది. మెదక్ జిల్లాలో ఎక్కడా సన్న ఇసుక దొరకడం లేదు.

సంగారెడ్డి జిల్లాలో..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇసుక కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి ఫిల్టర్ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో మంజీరా నది ఉన్నప్పటికీ ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. దీంతో జిల్లాలో గృహ, ఇతర నిర్మాణాలు, ఇంటి మరమ్మతు పనులు చేపట్టే వారంతా కాళేశ్వరం, బిచ్కుంద ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. నెల రోజుల క్రితం వరకు టన్ను ఇసుక ధర రూ.1200 వరకు ఉండేది. ప్రస్తుతం టన్నుకు రూ.1600 నుంచి రూ.1700 వరకు చేరుకుంది. రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి రావటంతో మధ్యతరగతి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పెరిగిన ధరలను వెంటనే నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుత ధరలతో బిల్డర్లు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధరలు తక్కువగా ఉన్నప్పుడు ప్రకటించిన స్క్వేర్‌ఫీట్ కంటే ఇప్పుడున్న ప్రకారం రూ.100 నుంచి 200 వరకు అదనంగా ధర పెంచాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ భారమంతా ఇండ్లు కొనుగోలు చేసే వారిపై వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. మరోవైపు ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్లు కూడా తమ వల్ల కాదంటూ పనులు నిలిపివేస్తున్నారు.

అక్రమంగా ఫిల్టర్ ఇసుక రవాణా..

ఇసుక ధరలు పెరగటంతో సంగారెడ్డి జిల్లాలో ఇసుక అక్రమ రవాణా ఊపందుకుంది. సంగారెడ్డి, హత్నూర మండలాల్లో కొంతమంది అక్రమంగా ఇసుక ఫిల్టర్లను నడుపుతున్నారు. రెవెన్యూ అధికారులు ఇటీవల కాలంలో సంగారెడ్డి, కంది మండలాల్లో ఆకస్మిక దాడులు చేపట్టి ఫిల్టర్లను కూల్చివేశారు. అయితే, కాళేశ్వరం నుంచి వచ్చే ఇసుక ధర అమాంతంగా పెరగటంతో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న కొంతమంది ఫిల్టర్ ఇసుక వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదనుగా మూసివేసిన ఇసుక ఫిల్టర్లను మళ్లీ తెరిచి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టి టన్ను ఫిల్టర్ ఇసుకను రూ.700 నుంచి రూ.800 వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

అక్షరాలా 1,70,70,724

‘మల్లన్న’ మూడోవారం ఆదాయం రూ.55,70,464

చేర్యాల, ఫిబ్రవరి 6: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి మూడో ఆదివారం సందర్భంగా రూ.55,70,464 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఎ.బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం తదితర వాటి ద్వారా శనివారం రూ.3,69,032, ఆదివారం రూ.45,65,237, సోమవారం రూ.6,36,195 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి రూ.17,70,724 అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. ఆయనతోపాటు ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుడి మల్లికార్జున్, కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది ఉన్నారు.

కొమురవెల్లి మల్లికార్జునస్వామి మూల విరాట్

మల్లన్నసాగర్ భేష్

ప్రాజెక్టును సందర్శించిన 12 మంది కర్ణాటక ఎమ్మెల్యేల బృందం

తొగుట, ఫిబ్రవరి 6: మల్లన్నసాగర్ నిర్మాణం భేష్ అని కర్ణాటక ఎమ్మెల్యేల బృందం పేర్కొంది. మంగళవారం సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని తుక్కాపూర్ వద్ద నిర్మించిన మల్లన్నసాగర్‌ను కర్ణాటక రాష్ట్రానికి చెందిన 12 మంది ఎమ్మెల్యేలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్నసాగర్ ప్రాజెక్టు రైతులకు వరంలాంటిదన్నారు. ఎమ్మెల్యేల బృందానికి ప్రాజెక్టు గురించి ఈఎన్‌సీ హరిరామ్ వివరించారు. కాశేశ్వరం ఆధారంగా వ్యవసాయం, తాగునీటి వ్యవస్థకు ప్రాజెక్టు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. తక్కువ సమయంలో భూ సేకరణ పూర్తిచేసి ప్రాజెక్ట నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలోఎస్ఈ బస్వరాజ్, ఈఈ సాయిబాబు, వెంటేశ్వర్‌రావు, డీఈ శ్రీనివాస్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రాజెక్టు నిర్మాణం అద్భుతం..

చిన్నకోడూరు, ఫిబ్రవరి 6: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో నిర్మించిన రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను కర్ణాటక ఎమ్మెల్యేలు మంగళవారం సందర్శించారు. పంపహౌస్ రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్టడీటూర్‌లో భాగంగా 20మంది ఎమ్మెల్యేలు వివిధ అంశాలపై ఈఎన్‌సీ హరిరామ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం అద్భుతంగా ఉందని ఎమ్మెల్యేలు కితాబిచ్చారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ బసవరాజ్, ఏఈలు, జేఈలు ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగూరు నీటి విడుదల

పుల్కల్, ఫిబ్రవరి 6: సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి పారుదల శాఖ అధికారులు మంగళవారం ఘనపూర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే జలవిద్యుత్ కేంద్రం నుంచి మూడో విడతగా 1460 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డిప్యూటీ డీఈ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీవాహక ప్రాంతాల ప్రజలు మత్స్యకారులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్టు సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 22.957 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.



సింగూరు జల విద్యుత్ కేంద్రం గేటు ఎత్తడంతో దిగువకు వెళుతున్న నీరు